# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 06-11-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **సమాచార ఆధారిత పాలన 'డేటా డ్రివెన్ గవర్నెన్స్' అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమావేశాన్ని నిర్వహించనున్నారు.**

2. **తీరప్రాంతాలోని మత్స్యకారుల భద్రతకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయని కేంద్రమంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు.**

3. **రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధానికి "డ్రగ్స్ వద్దు బ్రో" నినాదం ద్వారా పాఠశాల స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని హెూంమంత్రి వి.అనిత పేర్కొన్నారు.**

4. **గ్రామాల్లోనూ మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అన్నారు.**

5. **ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి చెప్పారు.**

=========================

సమాచార ఆధారిత పాలన 'డేటా డ్రివెన్ గవర్నెన్స్' అంశంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు సమావేశాన్ని నిర్వహిస్తారు. అమరావతిలో రాష్ట్ర సచివాలయంలో ఈ మధ్యాహ్నం జరిగే ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, కార్యదర్శులు, పోలీసు, అటవీ శాఖల ఉన్నతాధికారులు పాల్గొంటారు. అలాగే జిల్లాల కలెక్టర్లు, పోలీసు కమిషనర్లు, ఎస్పీలు దృశ్య మాధ్యమం విధానం ద్వారా సమావేశంలో పాల్గొంటారు.

-------------------------

తీరప్రాంతాలోని మత్స్యకారుల భదత్రకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్నాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు తెలిపారు. శ్రీకాకుళం గ్రామీణ మండలం పెద్దగనగల్లవానిపేట సమీపంలో కోటి 40 లక్షల రూపాయల కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మించనున్న నిల్వ గోదాం భవనానికి స్థానిక శాసన సభ్యులు గొండు శంకర్ తో కలిసి ఆయన ఈరోజు శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దగనగల్లవానిపేట మత్స్యకార గ్రామాన్ని సందర్శించి, నాగావళి నది సముద్రంలో కలిసే ప్రాంతంలో కోతకు గురవుతున్న సముద్ర తీర పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, తీరం కోత సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేలా , తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తీర పరిశోధన కేంద్రం సూచనల ప్రకారం, నది సహజ ప్రవాహ దిశను కాపాడే విధంగా ప్రాజెక్ట్‌కు రూపకల్పన చేయాలన్నారు. ప్రజల భద్రత,

జీవనాధారం కోసం ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

---------------------------

రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధానికి "డ్రగ్స్ వద్దు బ్రో" కార్యక్రమం ద్వారా పాఠశాల స్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని హెూంమంత్రి వి.అనిత పేర్కొన్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడారు. మాదక ద్రవ్యాలు, గంజాయి కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈగల్ వ్యవస్థను స్థాపించి ఏడాదిన్నర కాలంలో గంజాయి సాగును అరికట్టామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 25 సెకన్లు

---------------------------

ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో 406 ఉద్యోగమేళాల ద్వారా 78వేల మంది ఉద్యోగాలు లభించాయని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో నైపుణ్యాభివృద్ధి సంస్థ కార్యక్రమాలపై మంత్రి నిన్న ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ, ఉద్యోగ మేళాల్లో మరిన్ని సంస్థలను భాగస్వాములను చేసి యువతకు పెద్దఎత్తున ఉద్యోగాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతర్జాతీయ సంస్థలతో భాగస్వామ్యం కోసం కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కొత్త పరిశ్రమలు, వాటి అవసరాలను గుర్తించి ఐఐటీ, పాలిటెక్నిక్ కోర్సులలో పాఠ్యాంశాల మార్పులపై దృష్టిసారించాలని ఆదేశించారు.

---------------------------

రాష్ట్రానికి పెట్టుబడుల సాధనే లక్ష్యంగా భాగస్వామ్య సదస్సును రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలో మంత్రి ఈ రోజు పాత్రికేయులతో మాట్లాడుతూ, దాదాపు 10 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు ఈ సదస్సు ద్వారా వస్తాయన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖపట్నంలో జరిగే ఈ సదస్సు వల్ల ఉత్తరాంధ్ర ప్రాంతానికి, ఉపాధి అవకాశాలు పరిశ్రమల ఏర్పాటు వంటి మేలు జరుగుతుందని చెప్పారు.

---------------------------

గ్రామాల్లోనూ మౌలిక సదుపాయల కల్పనకు ప్రభుత్వం ప్రాధ్యామిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. బాపట్ల జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని కొప్పెరప్పాడు-చినజమ్మలమడక బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కొత్తూరులో సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన ఎరువులను పంపిణీ చేశారు. అలాగే కొప్పెరప్పాడు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సైకిళ్లను మంత్రి పంపిణీ చేశారు.

---------------------------

ప్రజల ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలా వీరాంజనేయ స్వామి తెలిపారు. విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ప్రభుత్వాసుపత్రిలో 2 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఆయన నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, వైద్య సేవలను డిజిటల్ విధానంలో ప్రజలకు చేరువ చేస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యమిస్తూ 25 లక్షల రూపాయలతో

సార్వత్రిక బీమా కల్పించేందుకు మంత్రి వర్గం ఇప్పటికే ఆమోదం తెలిపిందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

----------------------------

రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ఏర్పాటు కోసం ప్రభుత్వం నియమించిన సలహా సంఘం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమావేశమైంది. ఈసమావేశంలో నీతి ఆయోగ్ సభ్యులు, సలహా సంఘం చైర్మన్ వి.కె సారస్వత్, కమిటీ కో చైర్మన్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌తో పాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తికి తీసుకుంటున్న చర్యలు, ప్రాజెక్టులు వంటి అంశాలపై చర్చిస్తున్నారు. అలాగే గ్రీన్ హైడ్రోజన్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రత్యేక ప్రోత్సాహకాలపై సలహా సంఘం చర్చించనుంది.

----------------------------

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ-ఏపీఎస్ఎస్ డిసి ఆధ్వర్యంలో విజయవాడలో రేపు ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్. శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాలలో జరిగే ఈ మేళాలో 30 సంస్థలు పాల్గొంటున్నాయని తెలిపారు. ఈ మేళాకు పదవ తరగతి, ఐటిఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన 35 ఏళ్లలోపు అభ్యర్థులు హాజరుకావచ్చని తెలిపారు. ఉద్యోగ మేళాలో పాల్గొనే అభ్యర్థులు తమ వివరాలను naipunyam.ap.gov .in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

----------------------------

తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం పాతపాళెంలో ఈ తెల్లవారుజామున రాయలచెరువు కట్ట తెగిపోయింది. దీంతో దిగువ ప్రాంతాలైన కళత్తూరు, ఎస్.ఎల్.పురం, రాయపేడ్ గ్రామాలలో నీరు చేరింది. మొత్తం 1500 ఇళ్ళులు నీటమునిగి ఆస్తి నష్టం సంభవించిందని.. ఎటువంటి ప్రాణనష్టం జరుగలేదని రెవిన్యూ అధికారులు స్పష్టం చేశారు. జలమయయమైన ప్రాంతాలల్లో సహాయక చర్యలను ప్రారంభించారు. గ్రామస్తులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షానికి రాయలచెరువు సామర్థ్యానికి మించి నిండటంతో చెరువు కట్టతెగిపోయిందని అధికారులు తెలిపారు.

----------------------------

నైరుతి బంగాళాఖాతం నుండి తమిళనాడు మీదుగా ద్రోణి కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి. లక్ష్మీ తెలియజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

=====================